# కిటికి

- రేణుక అయోల



స్నేహితుడి పెళ్ళి కుక్కడెపల్లిలో రమ్మని ఫోను చేసాట, ఆదివారం సెలవు పెట్ట నవసరంలేదు. అందుకని బయలుదేరాను, బయలు దేరేముందే బైక్ మొరాయించింది. మెకానిక్ షాపువాడి కిచ్చీ, బస్సులో వెళ్ళాలని బయలు దేరాను. బస్‌స్టాండ్‌కి వెళ్ళగానే రడీగా ఉన్న బస్సు ఎక్కి కూర్చున్నాను ఖాళీగా ఉంది బస్సు కిటికి పక్క సీటు దొరికింది.. చాలా ఏళ్ళు అయింది. సిటీ బస్సు ఎక్కి ఇక్కడ నుంచి గంటన్నర ప్రయాణం. రిలాక్స్‌గా కూర్చున్నాను.

బస్సు బయలు దేరింది. లేడి కండక్టర్ వచ్చి టికెట్ అడిగింది. ఆడవాళ్ళంతా మేము వెనక పడ్డాము మమ్మల్ని అణగదొక్కుతున్నారు అంటూ వాపోతారు. మరీ ఇదేమిటి హాయిగా కండక్టర్లుగా,

అదీగాక మొన్నే చూసాను" సెవెన్‌సీటర్ ఆటో" కూడా ఒక ఆవిడ నడుపుతోంది. ఆడవాళ్ళు అన్నింటిలో సమాన హక్కులు పొందుతునే ఉన్నారుగా !!

కిటికి దీనికి చాలా ఇంపార్టెంట్ ఉంది జీవితంలో, రైలులో అయినా, ఇంట్లోనైనా ఎక్కడైనా సరే హాయిగా కిటికీ దగ్గర కూర్చుంటేచాలు ఎన్నో ఆలోచనలు పరుగెడుతుంటాయి. ఇంట్లో అయితే శ్రీమతి వచ్చేలోపల ఒక సిగిరెట్టు గుప్పు గుప్పున లాగించేసి అవతల పారేయొచ్చు. బస్సు వాహనాల మధ్య కుస్తీపడుతూ వెళుతోంది. ఎదురుగా ఉన్న బస్ స్టాపులో ఒక 'ఆవిడ' నిలబడిఉంది. ఒకే చూపులో చాలా ఆకర్షణీయంగా కనిపించింది. కొందరంతే ఎందమందిలో ఉన్నా వాళ్ళ వైపు చూపులు మరలించుకునేంత ఆకర్షణగా ఉంటారు. ఆవిడ కట్టుకున్న చీర రంగు ఆవిడకి చాలా నప్పింది.

మళ్లీ ఆలోచనలు స్త్రీల స్వాతంత్రయం వైపు మళ్ళాయి. మా ఆఫీసులో పని చేస్తున్న రాధారాణి ఎప్పుడూ మొగవారు అంటే స్త్రీలను రాచి రంపాన పెట్టే రాక్షసులు ఆవిడ దృష్టిలో. ఏమాత్రం వీలు చిక్కినా ఆడవాళ్ళందరి తరఫు న తానే వకాల్తా పుచ్చుకున్నట్లు మొగవాళ్ళ వల్ల నష్టపోతున్న లేక పడుతున్న బాధలు అన్నీ పెద్దలిస్టులా గబగబా చదివేసి, హమ్మయ్య ఇవాళ కూడా మొగవారి దురన్యాయాలన్నీ ఎండగట్టాను అనుకుని తృప్తిగా మావైపు చూస్తూ ఉంటుంది.

కాని భార్యా భాదితులని ఎవ్వరూ పట్టించుకోరు. మొగ వారు మొగవారితో చెప్పు కోలేరు. ఎందుకంటే మొగ వాడికి కష్టాలేమిటి వాడే పెద్ద కష్టం కదా ?!! లోకాభి ప్రాయం. అప్పుడప్పుడు చాలా విసుగ్గా ఉంటుంది. జీవిత మంతా నిస్సారంగా గడచి పోయినట్లు అనిపిస్తుంది.

**వావిలాల గోపాల కృష్ణయ్య**

ఈయన సెప్టెంబర్ 17, 1906 న గుంటూరు జిల్లా నత్తెనపల్లిలో జన్మించారు. సహాయ నిరాకరణోద్యమం నాటికి వీరు బాలుడే. ఆ ఉద్యమంలో భాగంగా సత్యాగ్రహంలో పాల్గొనడం వల్ల జైలు శిక్ష విధించబడింది. సారావ్యతిరేక ఉద్యమానికి అండగా నిలిచారు. 1974లో ఏర్పాటైన అధికార భాషా సంఘానికి తొలి అధ్యక్షులుగా వీరు నియమింపబడినారు. కడదాకా ఖాదీ వస్త్రాలను ధరించి, గాంధీజీ ఆదర్శాలను తు.చ. తప్పకుండ పాటించి 'ఆంధ్రాగాంధీ'గా ప్రశంసలందు కున్నారు.

చదువు బుద్ధిగా చదువుకుని, ఉద్యోగం సంపా దించుకుని యవ్వనంలో ఏ అమ్మాయి జోలికి వెళ్ళకుండా అమ్మ, నాన్నలు తెచ్చిన సంబంధం చేసుకున్నాను. "రాముడు మంచి బాలుడు" లా ఎన్నో కలలు కన్నాను పెళ్ళికి ముందు అన్నీ బూడిద అయిపోయాయి. లతతో జీవితం అసహనంగానే గడుస్తోంది.

సిగ్నల్ పడినట్లుంది. ఒక్క కుదుపుతో బస్సు ఆగింది. మోటర్ సైకిల్ మీద ఓ జంట హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. ఈ మధ్యన అమ్మాయిలు కూడా అబ్బాయిల్లా అటోకాలు, ఇటోకాలువేసి మొగవారిలా బైక్‌ల మీద కూర్చుంటున్నారు !! ఆ అమ్మాయి కూడా అలాగే కూర్చుంది అతని మీద వంగి కబుర్లు చెబుతుంది. వీళ్ళకి పెళ్ళి అయ్యిందా? అయి ఉండదు. అందుకే అన్ని కబుర్లు. పెళ్ళైతే దూరంగా మొఖం మాడ్చుకుని కూర్చుంటారు భార్య మణులు.

నేనూ లత పెళ్ళైన కొత్తలో ఇలా ఉన్నామా ? అప్పుడు బైక్ ఎక్కడిది? తరువాత కొన్నాను. కొత్తలో బైక్ కూడా లేదాఅని ఎంత చిన్నచూపో నేనంటే లతకి. ఏదో ఉద్ధరించి నన్ను చేసుకున్నట్లు మాట్లాడేది. అయినా సరదాలు చంపుకోకుండా ఉందామన్న ఉద్దేశంతో వాళ్ళ అమ్మవాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు డాబా మీదికి పిలిచాను, హాయిగా సాయంకాలం కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుందామని, కాఫీ పట్టుకుని వచ్చింది. ఏమిటి విషయం అన్నట్లు చూసింది. ఏంలేదు హాయిగా కబుర్లు చెప్పుకుందాం అన్నాను.

సరేకాని మీ జీతం ఎంత అని అడిగింది సడన్‌గా

ఎందుకూ అన్నాను, ఎందుకేమిటి, కారు లోన్‌పెట్టి తీసుకుంటే ఎంతకట్ అవు తుంది. మనం ఎలా బడ్జెట్ వేసు కోవాలి అందుకని అడిగాను.

అయినా ఇప్పుడు కారు గొడవెందుకూ మా వాళ్ళందరికీ ఉంది మనకీ ఉండాలిగా, లేకపోతే వాళ్ళముందు మరీ తేలికైపోతాను. మా అత్తమ్మ కూతురు ఇందిర మొన్ననే కారుకొంది తెగ ఫోజులు కొడుతుంది. మనకేం తక్కువ మీరు ఇంజనీరు కదా !! మనం కొందాం ఏమంటారు ? చూద్దాం! అన్నాను. ఏమనాలో తెలియక.

వస్తాను చాలా పని ఉంది క్రింద అంటూ కాఫీ కప్పు తీసుకుని వెళ్ళిపోయింది. లతకి ఖరీదైన జీవితం ఇష్టం. అన్నిటికి వాళ్ళ వాళ్ళతో పోల్చి నన్నో అసమర్ధుడిలా చూస్తుంది, వెక్కిరింతలు వేలాకోళాలు, చిరాకులు పరాకులు, వీటితో పాటుగానే పుట్టాడు మాకు బాబు. వాడి పేరు నవీన్. ఉన్నట్లుఉండి నా మీద ప్రేమలేదు అంటుంది. అసలు నా కోసం మీరేం చేసారు అంటూ నిలదీస్తుంది. ఏది ప్రేమ ఉంటే కారుకొనండి చూద్దాం. అంటూ సవాలు విసురుతుంది. ఇంక వాళ్ళ చుట్టాలు అయితే **"కారు లేని లత"** చాలా కష్టాలు పడుతున్నట్లు అందుకు నేనే బాధ్యుడిని అన్నట్లు నావైపు చూస్తారు.

బస్సు ఎర్రగడ్డ స్టాపులో ఆగింది. బస్సు ఆగగానే ఓ చక్కటి అమ్మాయి ఎక్కింది, ఆమె వేసుకున్న పంజాబి డ్రస్సు ఆమెకు సరిగ్గా అతికినట్టుగా ఉంది. ఇలాంటి అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోవలసింది. జుత్తుకూడా చాలా చక్కగా ఉంది. మరో స్టాప్ రాగానే ఆ అమ్మాయి దిగిపోయింది. ప్రేమించిన అమ్మాయి నన్ను చూడకుండా దిగిపోయినంత బాధపడ్డాను. మళ్ళీ కొంతమంది ఎక్కారు. అందులో లావుగా ఉన్న ఒక ఆవిడ ఎక్కలేక ఎక్కలేక ఎక్కింది. కొంచెం లావు తగ్గించుకో వచ్చుగా అనుకున్నాను. మళ్లీ లత జ్ఞాపకం వచ్చింది. పొరపాటున లావు తగ్గించుకోకూడదా అన్నాను. లత కొంచెం లావుగా ఉంటుంది.

**అనీబిసెంట్ వర్ధంతి**

'భగవద్గీత'ను ఇంగ్లీషులోకి అనువదించి, హోమ్‌రూల్ ఉద్యమాన్ని ప్రారంభించిన అనీబిసెంట్ సెప్టెంబర్ 20, 1933లో మరణించారు. మద్రాసులోని దివ్యజ్ఞాన సమాజంలో ఈమె సభ్యురాలు 1917 ఆగష్టులో జరిగిన కలకత్తా కాంగ్రెసుకు అధ్యక్షత వహించింది. జిడ్డు కృష్ణమూర్తిని చేరదీసి విద్యా బుద్ధులు నేర్పించి దివ్యజ్ఞాన సమాజానికి తన వారసునిగా ప్రకటించింది.

అంతే ఆ రోజంతా నాకు శిక్ష అయిపోయింది. నాకు తెలుసు మీకు నా మీద ప్రేమ తగ్గిపోయింది. అందుకనే నేను లావుగా లేకపోయినా ఉన్నా వంటున్నారు. పిల్లవాడు పుట్టాడు కదా ! ఎవరైనా లావెక్కుతారు, అలాగే కన్నెపిల్లలా ఉంటారా ! అప్పుడు నేను సన్నగా తీగలా లేను. ఇప్పుడు కదా ఇలా అయ్యాను... అక్కడితో ఈ విషయం ఆగలేదు. నేను అన్న మాటలు మననులో పెట్టుకుని సమయం చిక్కినప్పుడల్లా అందరి ముందు. మా వారికి నేను నచ్చనమ్మా లావుగా ఉంటానుగా అంటూ సాగదీస్తుంది.. తనకిలాంటి పెళ్లి సంబంధం తెచ్చిన పెళ్ళిపెద్దని, తిడుతుంది. తన బతుకు ఇలా అయిపోతుందని కలలో కూడా అనుకోలేదంటుంది ఏడుస్తుంది.

అలాంటప్పుడు ఏం చెయ్యాలో అర్థం కాదు.. ఎందుకు నోరు జారానా అని అనుకోని క్షణం ఉండదు ఇలా ఓ వారం రోజులు యుద్ధ వాతావరణం. ఏమి మాట్లాడకపోయినా జవాబు ఇవ్వకపోయినా మహానేరమే. ఏం మనిషి **'బెల్లం కొట్టిన రాయిలా'** ఉలుకూ పలుకూ ఉండదూ....

బస్సునడుస్తోంది. దూరంగా ఓ షాపులో టి.వి.లు. అన్నిటీవిలు ఒక్కసారే ఆన్ చేసి పెట్టాడు! హిందీ సీరియల్ ఏదో వస్తున్నట్లుంది.

ఇంట్లో ఈ టి.వి.లు, వాటిల్లో సీరియల్స్ భరించలేక పోతున్నాము. పిల్లలు కూడా వాటిముందు కూర్చుని ఆ సీరియల్స్‌పేర్లు చెబుతుంటే విరక్తి పుడుతోంది.

పెళ్లి కాకముందు ఎన్నో ఆదర్శాలు, పిల్లల్ని కనాలి. వాళ్ళని ఉన్నతంగా పెంచి పెద్ద చెయ్యాలనే ఆలోచన, ఏదో వాళ్ళని గొప్పవాళ్ళని చెయ్యాలన్న తపన.

అసలీ కాలంలో పిల్లల్ని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలనే ధ్యాస బూజుపట్టిన భావాలుగా అయిపోయాయి. మొన్నోసారి మా స్నేహితుడి అమ్మాయి పుట్టినరోజు పండగకి వెళ్ళాము. పాప చాలా ముద్దుగా ఉంది. ఓ పెద్దావిడ పాపని దగ్గరకి తీసుకుని, పాప నువ్వు పెద్దయ్యాక ఏమవుతావ్ అని అడిగింది.

ఆ పాప "మిస్ ఇండియా" అవుతానంది. అందరం ఆశ్చర్యపోయాము. చదువుకన్నా ముఖ్యం 'మిస్ ఇండియా' అవడం.

మునుపటి రోజుల్లో క్లాసులో అమ్మాయిలు అబ్బాయిలు అయిన అవకపోయిన దేశంకోసం పాటుపడతాం, లేకపోతే వీరజవాన్లు అవుతాము అనేవారు. కాని ఇప్పుడు అయితే అమెరికా ప్రయాణం లేకపోతే సినిమా స్టారులు.

వీటన్నింటి వెనకాల ఆశ, స్వార్థం. నేను, నాది అన్న సంకు చితత్వం.

మా అబ్బాయిని కూడా వాళ్ళు అడిగారు.

వాడికి నిండా ఆరేళ్ళు కూడా ఉండవ్, ఏరా నువ్వేమవు తావురా పెద్దయ్యాక ?

"బిన్ లాడన్" అవుతా అన్నాడు. అందరూ షాక్ అయ్యారు.

అలా అవ్వాలని ఎందుకనుకుంటున్నావ్ అని ఓ పెద్దాయన అడిగాడు.

అమెరికా లాంటి దేశాన్ని ముప్పు తిప్పలు పెట్టాడుగా!!

వాడి విజ్ఞానానికి ఆశ్చర్యపోవాలా ! దేశ పౌరులు చాలా ప్రగతిని సాధించారని ఆనందిం చాలా!? అందరూ వాడి సమాధానానికి నవ్వుతున్నారుగాని, నాకు మట్టుకు "భవిషత్తులో నిప్పులేకుండా కాలిపోతున్న అడవులు కనిపించాయి" భావి భారత పౌరుల ఆలోచనలు.

పిల్లలకి చదువువల్లే అన్ని తెలుస్తాయనే భ్రమతో చదువు, చదవండి. అంటూ పిల్లల్ని మభ్య పెడుతూ మనం కూడా ఆ భ్రమలోనే ఉన్నాము.

సంబంధాలు, ప్రేమలు, అనుబంధాలు ఏమి లేవు. అందరిదగ్గర ఒకే ఒక ప్రశ్న నువ్వు నాకేమిస్తావు? నా కోసం నువ్వేం చేస్తావు.

బస్సు ఆగింది. దిగండిసార్, ఇది కుక్కడ్‌పల్లీ స్టాపు అంటూ లేడీ కండక్టర్ నాతో చెప్పింది. ★

# తెల్లపాలన

గుండెనిండా పరాయితనం
దమనుల్లో దేశీయత ఎట్లా ప్రవహిస్తది ?

పాలనా భాష నాది కాదు
పాలకుల్లోనూ నా సంభాషణ లేదు
ఆహారం ఆహార్యం ఏవీ నావి కావు
సంస్కృతి అంతా వికృతం

తనువు తనువంతా
వశీకరణంలా పరాయీ కరణం చెంది
దేహం సమస్తం కొయ్యబారిన తనం

సామ్రాజ్యవాదం మన ధర్వాజముందు
ప్రపంచీకరణ మొకంపెట్టుకొని
ఇకిలించాన్నేడే
దేశీయత గుండె కలుక్కుమన్నది
బహుళ జాతులు భారతీయతపై కన్నేసి
సరళీకరణ కనుసైగచేసిన్నాడే
దేశీయత దేహం నీరసం చెందింది.

తెల్లవాన్ని తరిమి కొట్టినా
గ్లోబలైజేషన్ పూతతో ఇది తెల్లపాలనే
అంతా తెల్లభాష, తెల్ల సంభాషణ
పాలకుల రక్తమంతా తెల్లనే

**- అన్నవరం దేవేందర్**